
జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ దినకర్ పుండ్కర్, చిత్రంలో ఎమ్మెల్యే గొండు శంకర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

తెలుగుదనం ఉట్టిపడేలా

- జిల్లాలో ఘనంగా ఉగాది వేడుకలు
- ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు
- ఏరువాక చేపట్టిన రైతన్నలు

విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని ఆదివారం జిల్లా వాసులు ఘనంగా జరుపుకొన్నారు. తెల్లవారు జామునే పవిత్ర స్నానాలు ఆచరించి కొత్త వస్త్రాలు ధరించి ఉగాది సంబరాల్లో పాల్గొన్నారు. రైతన్నలు ఏరువాకను నిర్వహించి పొలం పనులకు శ్రీకారం చుట్టారు. పాడి పంటలు బాగా పండాలని పూజలు చేశారు. దేవాలయాలు, గ్రామ చావిడిల వద్ద పురోహితులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. కొత్త ఏడాదిలో వర్షాలు, వాతావరణ పరిస్థితులతో పాటు రాశి ఫలాలను వివ రించారు. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. చాలామంది కొత్త వాహనాలు, బంగారం, గృహోపకరణాలు, నూతన వస్త్రాలను కొనుగోలు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఒక్కరోజే రూ.100కోట్లకుపైగా వ్యాపారం సాగింది.


పంచాంగ శ్రవణం చేస్తున్న గౌరీశంకర శాస్త్రి

శ్రీకాకుళం కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి)

జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కళావేదికలో ఆదివారం పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఈ వేడుకల్లో పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కలెక్టర్ ఉగాది వేడుకలను ప్రారంభించారు. దైవజ్ఞ ధర్మపురి గౌరీశంకర శాస్త్రి పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంవత్సరంలో అంతామంచి జరుగుతుందని అన్నారు. గత 20 ఏళ్ల నుంచి ప్రజల ఆదాయం కన్నా వ్యయం అధికంగా ఉండేదని, ఈ సంవత్సరం ఆదాయం కన్నా వ్యయం తక్కువగా ఉందని చెప్పారు. రైతులకు ఆనందకరమైన సంవత్సరం అన్నారు. ఈ సంవత్సరం రెండు చంద్ర గ్రహణాలు ఉన్నాయన్నారు. ఆదాయ, వ్యయం, రాజపూజ్యం, అవమానం తదితర వివరాలను రాశుల వారీగా వివరించారు. అనంతరం ధర్మపురి గౌరీశంకర శాస్త్రితో పాటు దేవదాయ శాఖ ఎంపిక చేసిన అర్చకులను కలెక్టర్ సత్కరించారు. కవులు కేవీ రాజారావు, బొంతు సూర్యనారాయణ, పొట్నూరు సుబ్రహ్మణ్యం, ఈవేమన, ఉప కలెక్టర్ సవరమ్మ, మండా శ్రీనివాస రావు, ఆరవెల్లి అనంతరామం, దామోదరాచారి, రమణమూర్తి (మిగతా 8వ పేజీలో..)


కోటబొమ్మాళి: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు మిఠాయి తినిపిస్తున్న కార్యకర్త

అందరికీ సిరిసంపదలు కలగాలి: మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి: మార్చి30 (ఆంధ్రజ్యోతి): తెలుగువారికి ఉగాది నుంచే కొత్తదనం ప్రారంభమవుతుందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. తన స్వగ్రామం నిమ్మాడలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో పాల్గొన్నారు. కార్యకర్తలు మంత్రికి ఉగాది పచ్చడి, మిఠాయిలు తినిపించారు. అనంతరం ఆయన కార్యకర్తల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈకొత్త సంవత్సరం నుంచి అన్ని వర్గాల ప్రజలు కలిసికట్టుగా పనిచేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దామన్నారు. గ్రామాలకు అవసరమయ్యే నిధులు సమకూర్చు తానని హామీ ఇచ్చారు. జూన్ 26న స్థానిక జూనియర్ కళాశాల ప్రాంగణంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు చెప్పారు. నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జోరుగా వ్యాపారాలు

- కొనుగోలుదారులతో కిటకిటలాడిన బంగారు, వెండి దుకాణాలు
- ఎలక్ట్రానిక్, గృహోపకరణాల షాపులు కూడా..
- ఒక్కరోజే రూ.100కోట్ల వ్యాపారం

శ్రీకాకుళం/నరసన్నపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది వేళ జిల్లాలో వివిధ వ్యాపారాలు జోరుగా సాగాయి. ఉగాది రోజున కొత్తవస్తువు కొనుగోలు చేస్తే మంచిదని ప్రజల నమ్మకం. దీంతో ఆదివారం బంగారం, వెండి, వస్త్ర, సెల్, ఎలక్ట్రానిక్, గృహోపకరణాలు తదితర సామగ్రి కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపడంతో దుకాణాలు కిటకిటలాడాయి. జిల్లాలో ఒక్క ఆదివారం రూ.100 కోట్లకు పైగా ఆన్ లైన్, ఆఫ్‌లైన్ వ్యాపారాలు సాగాయని రాష్ట్ర జీఎస్టీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులో సగభాగం బంగారం, వెండి వ్యాపారానిదే అని చెబుతున్నారు. జిల్లాలో 600కు పైగా బంగారు, వెండి దుకాణాలు ఉన్నాయి. శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలి, కాశీబుగ్గ సోంపేట, ఆమదాలవలస, రణస్థలం, పలాస, పాతపట్నం, హిరమండలాల్లో బంగారం, గృహోపకరణాల విక్రయాలు జోరుగా సాగాయి. సెల్ ఫోన్లు, కొత్త వాహనాలు కూడా కొనుగోలు చేశారు. గతేడాది ఉగాదికి తులం బంగారం రూ.85 వేలు ఉండగా, ఈ ఏడాది రూ.లక్షా7 వేలకు చేరుకుంది. 22 క్యారెట్ల బంగారం రూ.97 వేలు పలికింది. బంగారం ఆల్ టైం రికార్డు సృష్టించినా.. కొనుగోలు దారులు మాత్రం వెనక్కి తగ్గలేదు. వెండి కొనుగోలు కూడా బాగా జరిగాయి. కిలో వెండి రూ.లక్షా 5 వేలకు చేరింది. కొన్ని చోట్ల బంగారు ఆభరణాలు కొనుగోలు చేసేవారికి సిల్వర్ క్వాయిన్లు ఇస్తామని, మరికొన్ని చోట్ల ఆభరణాలపై తరుగు శాతాన్ని తగ్గిస్తామని, గృహోపకరణాలకు లక్కీకూపన్లతో బహుమతులు ఇస్తామని వ్యాపారులు ఆఫర్లు ప్రకటించారు. దీంతో కొనుగోలుదారులు ఎగబడ్డారు.


నరసన్నపేట: జమ్ములో ఏరువాక చేపడుతున్న అన్నదాతలు


శ్రీకాకుళంలోని విజయగణపతి ఆలయం వద్ద కొత్తవాహనాలకు పూజలు చేస్తున్న దృశ్యం


ఉత్సవాల్లో పాల్గొన్న ప్రజలు


కిటకిటలాడుతున్న శ్రీకాకుళంలోని ఓ బంగారు దుకాణం

ముగ్గురికి రాష్ట్రస్థాయి ఉగాది పురస్కారాలు..


గార, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ రంగాలకు చెందిన ముగ్గురు వ్యక్తులకు రాష్ట్రస్థాయి ఉగాది పురస్కారాలు లభించాయి. గార మండలం శ్రీకూర్మం గ్రామానికి చెందిన నాట్యకారుడు శ్రీభాష్యం రామ కౌండిన్య, ఎల్.ఎన్.పేటకు చెందిన కొరికాన ఫౌండేషన్ నిర్వాహకురాలు కొరికాన భవాని, పొందూరు మండలానికి చెందిన ఉపాధ్యాయుడు, రచయిత, సాహితీవేత్త వావిలపల్లి రాజారావు రాష్ట్రస్థాయి ఉగాది పురస్కారాలు అందుకున్నారు. వీరికి ఆదివారం ఉదయం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సీఎం చంద్రబాబునాయుడు పురస్కారాలు అందించారు.


సీఎం చంద్రబాబు నుంచి పురస్కారాలు అందుకుంటున్న రామకౌండిన్య, భవాని, రాజారావు

పెద్దలకు ఇళ్లు.. పేదలకు నిల్

- గత వైసీపీ ప్రభుత్వంలో అనర్హులకు గృహాలు మంజూరు
- ఆ పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులకే లబ్ధి
- పూరి గుడిసెల్లో బతుకీడుస్తున్న ఎందరో పేదలు
- ప్రభుత్వంపైనే ఆశలు




కరజాడ కొండ పక్కనే కేటాయించిన స్థలంలో ఇళ్ల నిర్మాణాలు జరగని దృశ్యం

● మెళియాపుట్టి మండలం గోకర్ణపురం పంచాయతీ చిన్నాహంసకు చెందిన ధర్మాన కృష్ణారావు కుటుంబం గత 30 ఏళ్లుగా గ్రామంలోనే నివసిస్తోంది. ఇల్లు లేకపోవడంతో గ్రామ శివారులో ఉన్న ఓ చెట్టు కింద మట్టి గోడలతో గుడిసె వేసుకొని కృష్ణారావు కుటుంబ సభ్యులు జీవనం సాగిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇల్లు కోసం దరఖాస్తు చేసినా మంజూరు చేయలేదని కృష్ణారావు వాపోతున్నాడు. పెద్దోళ్లకే ఇళ్లు ఇచ్చారు తప్పా నాకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

● మెళియాపుట్టి మండలం కరజాడ గ్రామానికి చెందిన 44 మందికి గ్రామంలోని ఓ కొండ పక్క ఉన్న భూమిలో ఇళ్ల పట్టాలు అందించింది గత వైసీపీ ప్రభుత్వం. ఈ భూమిని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద అధిక ధరకు కొనుగోలు చేసింది. ఇక్కడ సౌకర్యాలు లేకపోవడంతో ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులెవరూ ముందుకు రాలేదు. ఎందుకూ వినియోగపడని భూమిని జగన్ సర్కారు కొనుగోలు చేయడంపై విమర్శలు వచ్చాయి.

మెళియాపుట్టి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి)

ఇల్లు లేని ప్రతి పేదవాడికీ పట్టాతో పాటు ఇంటిని నిర్మించి ఇస్తామని గత వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పింది. కానీ, వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. చాలామంది పేదలకు ఇళ్లు మంజూరు కాలేదు. వారు దరఖాస్తు చేసినా తిరస్కరించారు. వైసీపీ కార్యకర్తలు, మద్దతుదారులకే అధికంగా గృహాలు మంజూరు చేశారనే విమర్శలు ఉన్నాయి. జిల్లాలో జగనన్న కాలనీల పేరిట 790 లేఅవుట్లు వేశారు. 33,265 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. వీరిలో చాలా మంది అనర్హులు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పేదలకు బదులు పెద్దలకు పట్టాలు అందించినట్లు తెలుస్తోంది. మొత్తం 33,265 ఇళ్లకు గాను 10,153 గృహాలు పూర్తి చేసినట్లు అధికారులు తెలుపుతున్నారు. మరో 22,580 వరకు బేసిమెంట్ లెవల్‌లో ఉండగా, 532 గృహాల పనులు అసలు ప్రారంభించలేదు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 1,185 ఇళ్లు పూర్తిచేయగా, పాతపట్నంలో 323 నిర్మాణాలు మాత్రమే చేసినట్లు హౌసింగ్ అధికారులు తెలుపుతున్నారు. మెళియాపుట్టి పంచాయతీలో 152 ఇళ్లకు గాను 12 మాత్రమే పూర్తి చేశారు. 60 వరకు బేసిమెంట్ లెవల్‌లో ఉన్నాయి. మరో 80 పట్టాలకు సంబంధించి ఇంకా పనులు ప్రారంభించలేదు. ఇళ్లు ఉన్నవారికే పట్టాలు ఇవ్వడంతో చాలామంది ఆ స్థలాలను విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. అధికంగా వైసీపీ నాయకులకు సంబంధించిన బంధువులకే ఇళ్ల పట్టాలు ఇచ్చినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

సౌకర్యాలు లేక.. నిర్మాణాలు సాగక..

జగనన్న కాలనీల్లో సౌకర్యాలు లేక ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. అధికంగా జగనన్న కాలనీలు శ్మశానవాటికల పక్కన, కొండల కింద, గ్రామాలకు దూరంగా ఉన్నాయి. చాలాచోట్ల విద్యుత్, తాగు నీటి సౌకర్యాల పేరుతో అధికంగా నిధులు ఖర్చు చేసినా పనులు మాత్రం పూర్తి కాలేదు. కొన్నిచోట్ల బోర్లు తవ్వినా నీరు మాత్రం రావటం లేదు. దీంతో ఇళ్ల నిర్మాణాలకు చాలామంది వెనకడుగు వేస్తున్నారు.

దరఖాస్తు చేసుకోవాలి..

ఇళ్లు లేనివారు దరఖాస్తు చేసుకోవాలి. గత ప్రభుత్వంలో పట్టాలు మంజూరై నిర్మాణాలు చేయకపోతే వాటిని రద్దు చేస్తాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నాయి. గతంలో ఇళ్లు మంజూరు కాని వారు ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చు.

-నర్సింగరావు, డీఈ, హౌసింగ్ శాఖ, పాతపట్నం

నేడు రంజాన్

- ప్రార్థనలకు సిద్ధమైన మసీదులు



నరసన్నపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): నెలరోజుల రంజాన్ ఉపవాస దీక్షలు సోమవారంతో ముగియనున్నాయి. రంజాన్ కోసం జిల్లాలోని అన్ని మసీదులు సిద్ధమయ్యాయి. ఈ నెల 28 నుంచే రంజాన్ పర్వదినం కోసం మసీదుల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీకాకుళం, నరసన్నపేట, ఆమదాలవలస, పలాస తదితర ప్రాంతాల్లో అత్యధికంగా ప్రార్థనలు చేయనున్నారు. రంజాన్ మాసం నెల వంకతో ప్రారంభమై నెలవంక కనిపించగానే ముగుస్తుంది. ఉపవాస దీక్షల అనంతరం నెల వంక కనిపించగానే మరుసటి రోజు రంజాన్ పండుగ నిర్వహిస్తారు. దీనికోసం మసీదులను ముస్తాబు చేశారు. వాటికి రంగు, రంగుల విద్యుత్ దీపాలను అలంకరించారు. ఆయా మసీదుల్లో సోమవారం ఉదయం 7 గంటల నుంచి ప్రత్యేక నమాజ్‌లు జరగనున్నాయి. ముస్లింలు తక్బీర్ చదువుతారు. అనంతరం ఇమామ్‌లు ప్రత్యేక సందేశం ఇస్తారు. మసీదులు వద్ద ఒకరికొకరు ఈద్‌ముబారక్ చెప్పుకుంటారు. రంజాన్ పర్వదినం నాడు ముస్లిం కుటుంబాల ఇళ్లలో చేసుకునే షీర్ ఖుర్మా ప్రత్యేక రంజాన్ వంటకంగా ప్రసిద్ధ చెందింది. శ్రేష్ఠమైన సేమ్యాను తీసుకుని నేతిలో వేయిస్తారు. అనంతరం సమ పాళ్లలో పాలు, చక్కర కలిపి వండుతారు. దానిలో జీడిపప్పు, ద్రాక్ష, బాదంపప్పు, యాలకలు, నెయ్యి, గసగసాలు, సుగంధ ద్రవ్యాలు కలుపుతారు. ప్రత్యేకంగా తయారు చేసే ఈ షీర్ ఖుర్మాను మసీదులకు వెళ్లేటప్పుడు అల్లాహ్‌రంగా స్వీకరిస్తారు. మసీదులు నుండి రాగానే బిర్యానీలు వండి ఇరుగు పొరుగుకు పంచుకుంటూ రంజాన్ వేడుకలు ఆనందంగా గడుపుతారు.

చివరి అవకాశం

- ఆస్తి పన్ను వడ్డీపై రాయితీ
- 50 శాతం ఉపశమనం
- నేడు ఒక్కరోజే గడువు


ఆదివారం పన్నులు వసూలు చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

ఇచ్ఛాపురం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆస్తి పన్ను చెల్లింపుదారులకు శుభవార్త చెప్పింది ప్రభుత్వం. ఏకకాలంలో ఆస్తి పన్ను బకాయిలు చెల్లించేవారికి 50 శాతం వడ్డీ రాయితీని కల్పించనుంది. ఇప్పటికే కట్టిన వారికి వడ్డీ 50 శాతం రాయితీని వచ్చే ఏడాది ఆస్తి పన్నులో జమచేయనుంది. నిజంగా ఇది జిల్లాలో పట్టణ స్థానిక సంస్థలకు శుభవార్తే. జిల్లాలో శ్రీకాకుళం నగరపాలక సంస్థ, ఇచ్ఛాపురం, పలాస- కాశీబుగ్గ, ఆమదాలవలస మునిసిపాల్టీలు ఉన్నాయి. భారీగా ఆస్తి పన్ను బకాయిలు పేరుకుపోయాయి. గత కొన్నేళ్లుగా ఆస్తి పన్ను పెండింగ్‌లో ఉంది. దీనికి తోడు ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్నులు చెల్లించాల్సిన వారు చాలామంది ఉన్నారు. గతంలో బకాయిలతో పాటు ఈ ఆర్థిక సంవత్సరంలో ఏకమొత్తంలో కట్టిన వారికి ప్రభుత్వం ఈ రాయితీని అందించింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో జిల్లాలో పట్టణ పన్నుదారులకు రూ.3.87 కోట్ల మేర ఉపశమనం కలగనుంది.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో నాలుగు పట్టణ స్థానిక సంస్థలు ఉన్నాయి. మార్చి 31తో ముగియనున్న ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 78,071 అసెస్‌మెంట్ల ద్వారా రూ.45.37 కోట్ల ఆస్తి పన్ను వసూలు కావాల్సి ఉంది. ఇందులో ఈ నెల 25 నాటికి రూ.28.11 కోట్లు వసూలైంది. రూ.17.26 కోట్లు పెండింగ్‌లో ఉంది. ఈ నెల 31తో గడువు ముగియనున్న నేపథ్యంలో ప్రభుత్వం 50 శాతం వడ్డీ రాయితీని ప్రకటించింది. ఇచ్ఛాపురం మునిసిపాల్టీకి రూ.55 లక్షలు, పలాస-కాశీబుగ్గకు రూ.90 లక్షలు, ఆమదాలవలసకు రూ.33 లక్షలు, శ్రీకాకుళం నగరపాలక సంస్థకు రూ.5.96 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఈ మొత్తం రూ.7.74 కోట్లకు 50 శాతం రాయితీ ద్వారా రూ.3.87 కోట్లు పన్నుదారులకు ఉపశమనం కలిగించనున్నారు. కాగా, ఆస్తి పన్ను వసూలుకు సంబంధించి అధికారులు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. సోమవారం కూడా ఇవి అందుబాటులో ఉండనున్నాయి. సోమవారం రంజాన్ సెలవు దినం అయినా.. పన్నుల వసూలుకు చివరి రెండు రోజులు కావడం.. వడ్డీ రాయితీ ప్రకటించడం... తదితర కారణాలతో ఉదయం 6.30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ పనిచేయనున్నాయి. ఈ మేరకు పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు.

వినియోగించుకోవాలి..



ప్రభుత్వం పన్నుదారులకు 50 శాతం వడ్డీ రాయితీ కల్పించింది. గతంలో ఏకకాలంలో కట్టిన వారికి సైతం రాయితీ వర్తిస్తుంది. ఇప్పుడు బకాయిలు ఉన్న వారు కట్టినా రాయితీ వర్తింపజేస్తారు. పన్నుల వసూలుకు సంబంధించి కౌంటర్లు ఏర్పాటుచేశాం. పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

-ఎన్.రమేష్, కమిషనర్, ఇచ్ఛాపురం మునిసిపాల్టీ

ఆలయాల గోడలపై అన్యమత ప్రచారం
●బీజేపీ, వీహెచ్‌పీ, బజరంగదళ్ ఆందోళన ●యలమంచిలిలో ఉద్రిక్తత
8లో

వసంత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం
8లో

క్యాన్సర్ పేషెంట్‌కి ధైర్యం చెప్పిన హోంమంత్రి

● వీడియో కాల్‌లో మాట్లాడిన అనిత


లతశ్రీతో వీడియో కాల్ మాట్లాడుతున్న హోంమంత్రి అనిత

శ్రీకాకుళం క్రైం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితను దగ్గరి నుంచి చూడాలని శ్రీకాకుళం నగరానికి చెందిన లతశ్రీ ఎదురుచూస్తుంది. ఈమె గత ఎనిమిదేళ్లగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుంది. సభలు, సమావేశాల్లో హోంమంత్రి అనిత మాట్లాడుతున్న తీరును లతశ్రీ టీవీల్లో చూస్తుండేది. ఈ నేపథ్యంలో హోంమంత్రి అనితను దగ్గర నుంచి చూడాలని ఉందంటూ లతశ్రీ తన భర్త ఆనంద్‌కు చెప్పింది. ఈ విషయాన్ని తన స్నేహితుల ద్వారా హోంమంత్రికి ఆనంద్ తెలియజేశారు. దీంతో హోంమంత్రి అనిత ఆదివారం రాత్రి వీడియో కాల్‌లో లతశ్రీతో మాట్లాడారు. ధైర్యాన్ని మించిన మందులు లేవని ఆమెకు హోంమంత్రి ధైర్యం చెప్పారు. పెద్దపెద్ద అనారోగ్య సమస్య లతో సతమతమవుతున్నవారు కూడా మనోధైర్యంతో కోలుకుంటున్నారని, నువ్వు కూడా మనోధైర్యంతో ఉండాలని లతశ్రీకి హోంమంత్రి సూచించారు. త్వరలోనే శ్రీకాకుళం వచ్చి కలుస్తానని లతశ్రీకి భరోసా ఇచ్చారు.

ఆదిత్యాలయంలో భక్తుడి పర్సు మాయం

● ప్రసాదాల కౌంటర్ వద్ద చోరీకి గురైన వైనం

● కనిపించని సెక్యూరిటీ సిబ్బంది


ప్రసాదాల కౌంటర్ వద్ద గుంపుగా భక్తులు


పర్సు పోగొట్టుకున్న తాతారావు

అరసవల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): సూర్యనారాయణ స్వామి ఆయంలో ఆదివారం ఓ భక్తుడి పర్సు మాయమైంది. సెక్యూరిటీ సిబ్బంది లేకపోవడంతోనే తన పర్సును జేబుదొంగ కొట్టేసినట్లు ఆయన వాపోతున్నాడు. సంతబొమ్మాళి మండలం సీతానగరం గ్రామానికి చెందిన బచ్చల తాతారావు తన కుటుంబంతో కలిసి ఆదిత్యని దర్శించుకున్నాడు. అనంతరం ప్రసాదాల కౌంటర్ వద్దకు వెళ్లి ప్రసాదం కొనుగోలు చేసి బయటకు వచ్చి చూడగా.. నగదుతో ఉన్న తన పర్సు మాయమైనట్టు గుర్తించాడు. దీనిపై ఆలయ అధికారులకు ఫోన్‌లో ఫిర్యాదు చేశాడు. కొంతసేపటి తరువాత పర్సు ఖాళీగా వేరేచోట దర్శనమిచ్చింది. ఆలయ సిబ్బంది దానిని తాతారావుకు అందజేశారు. కాగా, ప్రసాదాల కౌంటర్ వద్ద ఆదివారం ప్రత్యేకంగా ఇద్దరు లేదా ముగ్గురు సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ, ఒక్కరు కూడా అక్కడ కనిపించలేదు. దీంతో కౌంటర్ వద్ద భక్తులు పెద్ద ఎత్తున గుమిగూడడంతో తాతారావు పర్సు అపహరణకు గురైంది. అదే సెక్యూరిటీ సిబ్బంది అక్కడ ఉండుంటే భక్తులు సక్రమంగా క్యూలైన్‌లో నిలబడి ప్రసాదాలు కొనుగోలు చేసేవారని, అప్పుడు తన పర్సు దొంగతానికి గురయ్యేది కాదని తాతారావు అంటున్నాడు. రూ.కోట్ల ఆదాయం వస్తున్న ఆలయంలో సెక్యూరిటీని కూడా ఏర్పాటు చేయకపోవడం దారుణమని భక్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆలయ అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కార్యదర్శిగా మణిబాబు


మణిబాబు

లావేరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కార్యదర్శిగా మురపాక గ్రామానికి చెందిన వమరవల్లి మణిబాబు నియమితులైయ్యారు. బాలల హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కార్యదర్శి గురుగుబిల్లి దామోదరరావు నుంచి నియమక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా మణిబాబు మాట్లాడుతూ.. తనకు ఇటువంటి అవకాశం కల్పించిన రాష్ట్ర కమిటీకి ధన్యావాదాలు తెలిపారు. బాలల హక్కుల పరిరక్షణ కోసం తనవంతు కృషి చేస్తానని చెప్పారు. మణిబాబును జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి శ్రీనివాసరావు అభినందించారు.

ఉత్సాహంగా బైరో భజన పోటీలు

జి.సిగడాం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాది పుష్కరాలు పురస్కరించుకొని మండల కేంద్రంలో సాయి నటరాజ్ కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మండల స్థాయి బైరో భజన పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ పోటీల్లో 11 భజన బృందాలు పాల్గొన్నాయి. దేవరవలస ఉమా చంద్రశేఖర భజన బృందం ప్రథమ, అద్వానంపేట శ్రీరామా భజన బృందం ద్వితీయ, బాతువ నటరాజేశ్వర భజన బృందం తృతీయ స్థానాల్లో నిలిచాయి. పెంట సీతారామ భజన బృందం, ఆనందపురం రామా భజన బృందాలకు కన్సొలేషన్ బహుమతులకు ఎంపికైనట్టు నిర్వాహకులు తెలిపారు. న్యాయ నిర్ణేతలుగా రాజాం, పొందూరు, రేగిడి మండలాలకు చెందిన రిటైర్డు ఉపాధ్యాయులు వంజరాపు సత్యం. బొడ్డేపల్లి జనార్దనరావు, బాలిశెట్టి అప్పన్నదొర వ్యవహరించారు.

సారా నియంత్రణపై అవగాహన

ఇచ్ఛాపురం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): సారా నియంత్రణ నవోదయం-2 కార్యక్రమంలో భాగంగా ప్రతీ గ్రామంలోనూ గ్రామసభలు ఏర్పాటు చేసి సారాపై అవగాహన కల్పిస్తున్నట్టు సీఐ పి.దుర్గాప్రసాద్ తెలిపారు. మార్చిలో జరిపిన దాడుల్లో 22 కేసులు నమోదు చేశామన్నారు. సారాపై రెండు, ఒడిశా మద్యంపై ఏడు, డ్యూటీ పెయిడ్ లిక్కర్ కేసులు ఆరు, గంజాయిపై ఒకటి, బహిరంగ మద్యం తాగడంపై ఆరు కేసులు చేశామన్నారు. ఒక ద్విచక్ర వాహనం, ఒక కారు సీజ్ చేయడం జరిగిందన్నారు. సారా, గంజాయి, అక్రమ మద్యం రవాణా గురించి 14405 టోల్ ఫ్రీ నెంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రైల్వే ట్రాక్ మధ్యలో నిలిచిన ఇసుక లారీ


ట్రాక్ మధ్యలో నిలిచిపోయిన లారీ.. నిలిచిన వాహనాలు

ఆమదాలవలస, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని దూసి రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న గేటు వద్ద ఆదివారం ఇసుక లారీ రైల్వే పట్టాల మధ్యలో నిలిచిపోయింది. నాగావళి నది నుంచి ఇసుక లోడుతో విశాఖ వైపు వెళ్తున్న ఈ లారీ గేటు ట్రాక్ దాటుతుండగా.. టైర్ పంక్చర్ అయింది. ట్రాక్‌పై లారీ నిలిచిపోయింది. దీంతో ఇరువైపులా గంటల తరబడి భారీ స్థాయిలో వాహనాలు నిలిచిపోయాయి. పరిస్థితి గమనించిన రైల్వే ఉద్యోగులు, ఆర్‌పీఎఫ్ పోలీసులు స్థానికులు సాయంతో లారీను నెట్టుకుంటూ రైల్వేట్రాక్‌ల మధ్య నుంచి గేటు బయటకు దాటించారు. దీనితో వాహనదారులు, స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.


పాతపట్నం: నీలమణి అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు


శ్రీకాకుళం కల్చరల్: విజయగణపతి ఆలయంలో ఎమ్మెల్యే గొండు శంకర్ దంపతులు..


రణస్థలం: వీఎన్ పురంలో పొలం దున్నుతున్న విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

అంబరాన ఉగాది సంబరం

● పంచాంగ శ్రవణం వినిపించిన పురోహితులు

● ఆలయాలకు పోటెత్తిన భక్తులు

ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం తెల్లవారు జామున గ్రామాల్లో రైతన్నలు ఏరువాకను ప్రారంభించారు. కొత్త నాగళ్లకు పూజలు చేసి పొలం పనులు ప్రారంభించి పాడి పంటలు బాగా పండాలని కోరుకున్నారు. అలాగే ఉగాది సంబరాలు అంబరాన్ని అంటాయి. గ్రామాల్లో పురోహితులు పంచాంగ శ్రవణం వినిపించారు. వివిధ ఆలయాలకు భక్తులు పోటెత్తారు.

- ఆంధ్రజ్యోతి బృందం


అరసవల్లి: ఆదిత్యాలయంలో పంచాంగ శ్రవణం..


ఎల్ఎన్ పేట: ముంగెన్నపాడులో పంచాంగ శ్రవణం..


గార: కూర్మనాథ ఆలయంలో..


జలుమూరు: శ్రీముఖలింగేశ్వరాలయంలో..


టెక్కలి: పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్న పురోహితులు


నందిగాం: పంచాంగ శ్రవణం వింటున్న రైతులు

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం


సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

జి.సిగడాం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. ఆదివారం వాండ్రంగిలో 'నమస్తే ఎచ్చెర్ల- మన ఊరికి మన ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా గ్రామంలో నిర్మించిన గ్రామ సచివాలయం, సీసీ రహదారులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ప్రధాన ధ్యేయమన్నారు. తాగునీటి సమస్య, గృహాల మంజూరు తదితర సమస్యలను ఆ గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా.. త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ సాకేటి నాగరాజు, నాయకులు బూరాడ వెంకటరమణ, పైల విష్ణుమూర్తి, వజ్జపర్తి రఘురాం, కుమరాపు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం


మంజూరు పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే అశోక్

కంచిలి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. పెద్దశ్రీరాంపురం గ్రామానికి చెందిన లోళ్ల గోపి అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.92,312 చెక్కును కవిటి మండలం రామయ్యపుట్టుగలో గల తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో మాదిన రామారావు, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో ఎస్పీ


ఎస్పీకి, విజిలెన్స్ ఎస్పీకి ప్రసాదం అందజేస్తున్న దృశ్యం

అరసవల్లి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి దర్శించుకున్నారు. అలాగే శ్రీకాకుళం విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాదరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి అర్చకులు స్వాగతం పలుకగా, ఈవో భద్రాజీ ప్రసాదాన్ని అందజేశారు.

● శ్రీకాకుళం నగరానికి చెందిన గర్లంకి ఉమామహేశ్వరరావు, ఈశ్వరమ్మ స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి శాశ్వత అన్నదాన పథకానికి రూ.లక్షను ఈవో భద్రాజీకి అందజేశారు.

కంచమ్మతల్లికి పూజలు


అలంకరణలో అమ్మవారు

కంచిలి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): కంచమ్మ తల్లి ఆలయంలో ఉగాది సందర్భంగా సుప్రభాత సేవ, సహస్ర నామార్చన, ప్రత్యేక పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులతోపాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా అన్నమయ్య స్వరార్చన


అన్నమయ్య స్వరార్చన నిర్వహిస్తున్న దృశ్యం

అరసవల్లి/శ్రీకాకుళం కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): నగరంలో స్థానిక కలెక్టర్ బంగ్లా వద్ద గల ఆరోహి సంగీత కళాశాలలో అన్నమయ్య స్వరార్చన ఆదివారం ఘనంగా నిర్వహించారు. కళాశాలలో సంగీతం అభ్యసిస్తున్న సుమారు 50 మంది కళాకారులు, విద్యార్థులు, చిన్నారులు కీర్తనలు ఆలపించి, శ్రోతలను మంగ్ర ముగ్ధులను చేశారు. తబలాపై సూర్యనారాయణ, పాడ్స్ రామకృష్ణ వాద్య సహకారం అందజేశారు. సంగీత కళాశాల నిర్వాహకులు, ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రారంభమైన శ్రీమద్రామాయణ ప్రవచనాలు



సన్మానిస్తున్న దేవదాయశాఖ ఏసీ

శ్రీకాకుళం కల్చరల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పాలకొండ రోడ్డులోని కోదండ రామాలయంలో గల ఉపనిష్మందిరంలో ఆదివారం శ్రీమద్రామాయణ ప్రవచనాలు ప్రారంభమయ్యాయి. శ్రీరామనవమి ఉత్సవాలను పురష్కరించుకుని తెన్నేటి విక్రమశర్మ ఆధ్వర్యంలో శ్రీరామ చరిత్ర విశేషాలను వివరించారు. ఈ ప్రవచనాలు వచ్చే నెల 12వ తేదీ వరకు కొనసాగనున్నాయి. కార్యక్రమంలో ఉపషన్మందిరం గౌరవాధ్యక్షుడు గుమ్మా నగేష్, నిష్ఠల నరసింహమూర్తి, పతంజలి శాస్త్రి, విశ్వానాథం. కామేశ్వరరావు, దేవదాయశాఖ అధికారి ప్రసాదరావు పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి హరకేశ్వర స్వామి కల్యాణోత్సవం


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): సింగుపురం కొండపై కొలువైన పార్వతీ కొండమ్మ సమేత హరకేశ్వర స్వామి కల్యాణ యాత్ర మహోత్సవాలు వచ్చే నెల 4నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఆదివారం రాత్రి ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆలయ ప్రధానార్చకులు పెంట రామకృష్ణ శర్మ, సర్పంచ్ గుండ ఆదిత్యనాయుడు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 4న ధ్వజారోహణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 8న కొండమ్మ పిలుపు, 9న స్వామివారి కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. 10న సాయంత్రం 6గంటలకు ఆలయంలో సదస్య ఉత్సవం, 11న దీపోత్సవం, 12న నాకబలి (వసంతోత్సవం), 13న యాత్ర ముగింపోత్సవం జరుగుతుందన్నారు. 12న జరిగే కార్యక్రమాల్లో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్రమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొంటారన్నారు.

దేవీ ఆశ్రమంలో పూజలు


మహా మేరువుకు హారతి ఇస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కుంచాల కురమయ్యపేటలోని దేవీ ఆశ్రమంలో ఉగాది పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి తేజోమూర్తుల బాలభాస్కరశర్మ ఆధ్వర్యంలో పూజ లు జరిగాయి. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులతో శ్రీచక్రాలకు పూజలు జరిపా రు. మంగళవారం పంచమి సందర్భంగా 40 కిలోల కుంకుమతో అమ్మ వారికి, శ్రీచక్రాలకు పూజలు నిర్వహిస్తామని పీఠాధిపతి తెలిపారు.

ఘనంగా తులసమ్మ సంబరం


అమ్మవారి ఘటాలతో మహిళలు


కాళికామాత వేషధారణలో..

ఇచ్ఛాపురం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధి 21వ వార్డు గొల్లవీధికి చెందిన కొన్ని కుటుంబాలు ధనరాజ తలసమ్మ తల్లి సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం అమ్మవారి ఘటాలతో, కాలికా దేవి, కోయి డ్యాన్స్‌లతో ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం బస్టాండ్ జంక్షన్ నుంచి లొద్దపుట్టి గ్రామదేవత తులసమ్మతల్లి గుడి వద్దకు చేరుకుని అమ్మవారికి పానకాలు, పంచామృతాలు, పసుపు నీరుతో అభిషేకాలు జరిపించారు.

ఇలా ఉంటే ప్రమాదం కాదా?


ఎండిపోయిన చెట్టు.. కింద నుంచి వెళ్తున్న విద్యుత్ వైర్లు

గార, మార్చి 30(ఆంధ్రజ్యోతి): కుమ్మరిపేట వద్ద ఆర్అండ్‌బీ రోడ్డు పక్కనే పెద్ద చెట్టు ఎండిపోయి కనిపిస్తోంది. ఈ చెట్టు కింద నుంచి విద్యుత్ లైన్లు ఉన్నాయి. ఏ మాత్రం గాలి వేసినా చెట్టు కొమ్మలు విరిగి పడి ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు భయపడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు పక్కనే ఉన్న ఈ చెట్టును తొలగించడానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ ఏఈ గోవిందరావు వద్ద ప్రస్తావించగా చెట్టును పరిశీలించి తొలగింపునకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సందడిగా బడ్డిపోలమ్మ జాతర

పలాస, మార్చి 30(ఆంధ్రజ్యోతి): బడ్డిపోలమ్మ జాతర ఆదివారం రాత్రి భక్తజన సందోహం మధ్య ఘనంగా జరిగింది. 300 ఏళ్ల కిందట అమ్మవారి ఆలయం నిర్మించగా ప్రతిఏటా ఉగాది నాడు జాతర నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది ప్రత్యేకంగా వీధుల న్నీ విద్యుద్దీపాలతో అలంకరించి అమ్మవారి ఆలయానికి ప్రత్యేక శోభ తీసుకువచ్చారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద నృత్య ప్రదర్శన, కోలాటాలను నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు.


జాతరలో పాల్గొన్న భక్తులు

అనుమానాస్పద స్థితిలో కార్మికుడి మృతి


మృతి చెందిన అప్పలసూరి

రణస్థలం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలోని ఒక పరిశ్రమలో పని చేస్తున్న ఓ కార్మికుడు ఆదివారం సాయంత్రం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, తోటి కార్మికులు తెలిపిన వివరాల మేరకు.. జేఆర్ పురం పరిధిలోని జీఎంఆర్ కాలనీకి చెందిన పిన్నింటి అప్పలసూరి(47) ఆ పరిశ్రమలో మిషన్ ఆపరేటర్‌గా విధులు నిర్వ హిస్తున్నాడు. ఆదివారం విధులకు వచ్చిన ఆయన పరిశ్రమలోని బాత్ రూమ్‌లో ప్లాస్టిక్ ప్యాకేజీ రూప్‌తో ఉరివేసుకుని మృతి చెందాడు. అప్పల సూరికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

వేధింపుల వల్లే..


ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

అప్పలసూరి మృతి విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆదివారం రాత్రి పరిశ్రమ వద్దకు చేరుకుని ఆందోళన చేశారు. అతడి భార్య అమ్మిలు మాట్లాడుతూ.. పరిశ్రమ అధికారుల వేధింపుల వల్లే తన భర్త ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని ఆరోపించింది. తమ కుటుంబానికి న్యాయం చేయాలం టూ భీష్మించి కూర్చుంది. ఈ ఘటనపై పోలీసుల నుంచి వివరాలు తెలుసుకునేందుకు 'ఆంధ్రజ్యోతి' ప్రయత్నించగా.. వారు స్పందించలేదు.

రెండు ఇళ్లలో చోరీ

ఎచ్చెర్ల, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ధర్మవరం గ్రామంలో శనివారం అర్ధరాత్రి రెండు ఇళ్లలో చోరీ జరిగింది. గ్రామంలో చింతు సత్యం, లక్ష్మణరావు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 16వ తేదీన తీర్థయాత్రలకు వెళ్లారు. ఇంటికి తాళం వేడాన్ని గమనించిన దొంగలు తాళాలను పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలో భద్రపరిచిన బంగారు నగలును దొంగిలించారు. సత్యంకు చెందిన 7.5 తులాలు, లక్ష్మణరావుకు చెందిన రెండు తులాల బంగారు ఆభరణాలు అపహరించారు. తీర్థయాత్రల్లో ఉన్న సత్యం, లక్ష్మణరావులకు గ్రామంలోని బంధువులు సమాచారం ఇవ్వడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని క్లూస్ టీమ్ పరిశీలించి, ఆధారాలు సేకరించింది.

బంగారం గొలుసు అపహరణ

కంచిలి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): అమ్మవారిపుట్టుగ గ్రామంలోని ఓ వృద్ధురాలి మెడలో నుంచి నాలుగు తులాల బంగారం గొలుసును అపహరించారు. కంచిలి పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. గ్రామానికి చెందిన బొడ్డ అమ్ముడమ్మ (అమ్మాయమ్మ) ఇంటి వెనుక గదిలో నిద్రిస్తుండగా.. శనివారం అర్ధరాత్రి 1.30గంటలకు గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి పెరటి నుంచి ప్రవేశించి, ఆమె మెడలోని సుమారు నాలుగు తులాల బంగారం పుస్తెల తాడు చోరీ చేసినట్టు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పి.పారినాయుడు తెలిపారు.

ఊరంతా ఒకేసారి చేపల వేట


చిన్ననారాయణపురం చెరువులో చేపలు పడుతున్న గ్రామస్థులు

టెక్కలి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉగాది రోజున చేపల వేటకు శ్రీకారం చుట్ట డం ఆనవాయితీ. అందులో భాగంగా ఆదివారం మండలంలో పలు గ్రామాల్లో చెరువుల్లో గ్రామస్థులు ఒకేసారి చేపల వేటను చేపట్టారు. ఊజిలు పట్టుకొని చేపలను పడుతూ సందడి చేశారు.

తెలుగు సంప్రదాయాలను కాపాడుకోవాలి

పలాస, మార్చి 30(ఆంధ్రజ్యోతి): తెలుగు సంప్రదాయాలు కాపాడుకునే బాధ్యత అందరి పై ఉందని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తులాల నవరమ్మ అన్నారు. జనజాగృతి సాహితీ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం ఉగాది ఉత్సవాలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా 42 మంది కవులతో కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో జానపద కళా కారుల సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కుమార్ నాయక్, ఏయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ విజయ సింహవర్మ, హెచ్.వై.దొర, కాళిదాస్, బాలరాజు, శిష్టు మనోజ్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

దేశసేవలో ఆర్ఎస్ఎస్


మాట్లాడుతున్న సలాన రాఘవరావు

మెళియాపుట్టి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): దేశ సేవలో ఆర్ఎస్ఎస్ ఎప్పుడూ ముందుంజలో ఉంటుందని ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సలాన రాఘవరావు తెలిపారు. ఆదివారం వసుంధర గ్రామంలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విపత్తుల సమయంలో బాధితులను, ప్రజలను అన్ని విధాలా ఆదుకునేందుకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు కార్యక్రమంలో పాతపట్నం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి సలాన శరత్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతో మాదిగలకు న్యాయం


మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న దృశ్యం

హిరమండలం, మార్చి 30(ఆంధ్రజ్యోతి):ఎస్సీ వర్గీకరణతో మాదిగలకు, ఎస్సీ ఉపకులాలకు న్యాయం జరిగిందని హిరమండలం మాదిగ యువజన నాయకులు కంటి త్రినాథ అన్నారు. ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2004 తర్వాత మాదిగ లకు, ఎస్సీ ఉపకులాలకు తీవ్ర అన్యాయం జరిగిం దన్నారు. ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలపడం ఆనందంగా ఉందన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ గాంధీనగర్ యువసేన, మాదిగ ఉద్యోగ నాయకులు పాల్గొన్నారు.

వసంత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వసంత నవ రాత్రి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. శ్రీ రామనవమి రోజు వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

జట్టు కలాసీ యూనియన్ ఆధ్వర్యంలో..

నరసన్నపేట, మార్చి 30: శ్రీరామనవమిని పురస్కరించుకుని ఆదివారం వసంత నవరాత్రి ఉత్సవాలను స్థానిక జట్టు కళాసీ యూనియన్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. శ్రీ విశ్వావసు నామ సంవ త్సర వేడుకలతో పాటు సీతారాముల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు పురోహితులు కామేశ్వరరావు ఆధ్వర్యంలో చేపట్టారు. ఉత్సవాలకు శుభ వేశారు. అలాగే కొత్తబస్టాండ్, జమ్ము గణేష్ షిర్డీసాయి సహిత శ్రీరామ మందిరంలో మావుడూరి జగదీశ్వర శర్మ ఆధ్వర్యంలో వసంత నవరాత్రి మహోత్సవాలను ప్రారంభించారు. తామరాపల్లి, మాకివలస, కోమర్తి, ఉర్లాం తదితర గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు ప్రారంభించారు.


నరసన్నపేట: శుభరాట వేస్తున్న జట్టు కలాసీ సంఘ సభ్యులు

సీతారామాలయంలో..

పలాస, మార్చి 30(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని సీతారామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు ఆదివారం ఉగాది నాడు ఘనంగా ప్రారంభించారు. ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా తయారు చేసిన సింహాసనంపై వేంచేపు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్స వాలు ఏప్రిల్ 6న శ్రీరామనవమి నాడు సీతారాముల కల్యాణం, పట్టాభి షేకంతో ముగుస్తాయి. ఆలయం నిర్మించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భం గా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరం ఏర్పడి 25 ఏళ్లు కావస్తున్న సందర్భంగా శ్రీరామనవమి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రతిరోజు హరికథ, శాస్త్రీయ నృత్యప్రదర్శన నిర్వహిస్తున్నట్లు మందిర ప్రధాన కార్యదర్శి గిన్ని జయశంకర్‌రెడ్డి తెలిపారు.

పంచముఖ ఆంజనేయాలయంలో..

కాశీబుగ్గ,మార్చి30(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ పాత జాతీయరహదారి ఎల్‌సీ గేటు వద్ద ఉన్న పంచముఖ ఆంజనేయ ఆలయంలో చైత్రమాస శుద్ధ పాడ్యమి ఉగా ది ని పురస్కరించుకొని వసంత దుర్గా నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. శ్రీరామ నవమి వరకు 9 రోజుల పాటు ప్రత్యేక పూజలు, హోమాలు చేపడుతున్నట్లు అర్చకుడు బుద్దిరామ్ పాత్రో తెలిపారు. కార్యక్రమంలో తొలి రోజు కుమారి పూజ నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. ప్రతిరోజూ సాయంత్రం సప్తశతి పారాయణంతో పాటు అమ్మవారికి ఇష్టమైన 23 రకాల ప్రసాదాలతో నైవేద్యం సమర్పిస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా నీలమణి దుర్గ ఆలయ వార్షికోత్సవం

హిరమండలం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): హిరమండలం పెద్దకోరాడ వీధిలోని నీలమణిదుర్గ ఆలయ 47వ వార్షికోత్సవాలు ఆదివారం ప్రాంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ముర్రాటలు సమర్పించారు. సాయంత్రం పంచాంగ శ్రవణం చేప ట్టారు. మహిళలు దీపాలను వెలిగించి భక్తిని చాటుకున్నారు.


పలాస: పూజలు చేస్తున్న అర్చకులు

నవమి ఉత్సవాలకు శుభరాట

కంచిలి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): కంచిలి రైల్వే స్టేషన్ ఆవరణలో శ్రీ రామ నవమి నవరాత్రి ఉత్సవాలు ఏప్రిల్ 6వ తేదీనుంచి ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సందర్భంగా కమిటీ సభ్యులు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో ఆదివారం శుభరాట వేశారు. కార్యక్రమంలో జగదీష్ పట్నాయక్, బుడ్డేపు కామేష్‌రెడ్డి, ఇప్పిలి కృష్ణారావు, కొంచాడ అప్పలరాజు, ఇప్పిలి ప్రవీణ్‌కుమార్, బీపీ యాదవ్, పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణ రాట వేడుకలు

రణస్థలం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): కోష్ట పంచాయతీలో ఆదివారం ఉదయం రామ మందిరం వద్ద సీతారాముల కల్యాణ రాట వేడుకలు టీడీపీ సీనియర్ నేత పిసిని జగన్నాథంనాయుడు, లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీరామ నవమి రోజున ఆలయంలో ప్రత్యేక పూజలు జరగనున్నాయని, అదే రోజున స్వామివారి ఊరేగింపు ఉంటుం దని వారు తెలిపారు.


హిరమండలం: దీపారాధన చేస్తున్న భక్తులు


కంచిలి: శుభరాట వేస్తున్న కమిటీ సభ్యులు


కాశీబుగ్గ: పూజలందుకున్న దుర్గామాత

ఆలయాల గోడలపై అన్యమత ప్రచారం

- బీజేపీ, వీహెచ్‌పీ, బజరంగదళ్ ఆందోళన
- యలమంచిలిలో ఉద్రిక్తత
- సీసీ కెమెరాలు అమర్చకపోవడంపై ఎస్పీ అసంతృప్తి
- గోడలపై వేలిముద్రలు సేకరించిన క్లూస్‌టీమ్

జలుమూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): జలుమూరు మండలంలోని వివిధ ఆలయాల గోడలపై అన్యమత ప్రచారం రాతలు కలకలం సృష్టించాయి. యలమంచిలి ఎండల కామేశ్వర, కామినాయుడుపేట అభయాంజనేయ, కొండకామేశ్వరపేట ఆంజనేయస్వామి ఆలయాల గోడలపై శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఏసుక్రీస్తు శిలువ గుర్తు, ఏసుక్రీస్తు ప్రచార బోధనలు నలుపు రంగుతో రాశారు. యలమంచిలి ఎండల కామేశ్వరస్వామి ఆలయ అర్చకులు వసనాభి వెంకటరమణ ఆదివారం తెల్లవారుజామున ఆ రాతలను గమనించి గ్రామపెద్దలకు తెలిపారు. వారిచ్చిన సమాచారంతో విశ్వహిందూ పరిషత్, బజరంగదళ్, బీజేపీ నాయకులు వచ్చి ఆందోళన చేపట్టారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గోడలపై ఉన్న రాతలను చెరిపేసేందుకు ప్రయత్నించగా వీహెచ్‌పీ నాయకులు అడ్డుకున్నారు. తమకు న్యాయం జరిగే వరకు చెరపడానికి వీల్లేదని తేల్చిచెప్పారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, అడిషనల్ ఎస్పీ పి.శ్రీనివాసరావు, టెక్కలి, శ్రీకాకుళం డీఎస్పీలు మూర్తి, సీహెచ్.వివేకానంద, నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావు, సారవకోట, నరసన్నపేట, పోలాకి ఎస్ఐలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో గ్రామ పెద్దలు, బీజేపీ, వీహెచ్‌పీ, బజరంగదళ్ నేతలు శాంతించారు. గోడలపై వేలిముద్రలను క్లూస్ టీం సేకరించింది. ఇంత విశిష్టత కలిగిన ఆలయంలో సీసీ కెమెరాలు అమర్చకపోవడంపై ఎస్పీ మహేశ్వరరెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. అర్చకుడు వసనాభి వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సారవకోట ఇన్‌చార్జి ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపారు.


వీహెచ్‌పీ ప్రతినిధులు, గ్రామస్థులతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు


మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద స్వామి

పాస్టరుపై గ్రామస్థుల అనుమానం

ఆలయ గోడలపై రాతలు యలమంచిలిలో నివసిస్తున్న పాస్టరు చొక్కాపు శంకరరావు, ఆయన కుమారుడు హైజాక్ పనే అయి ఉంటుందని గ్రామస్థులు పోలీసులకు తెలిపారు. శంకరరావు బుడితి చర్చి పాస్టరుగా పనిచేస్తూ యలమంచిలిలో గత 10 ఏళ్లుగా నివాసం ఉంటున్నారు. శంకరరావు తన కుమారుడితో కలసి శనివారం రాత్రి 10 గంటల తరువాత ద్విచక్రవాహనంపై తిరిగారని, ఈ రాతలు వారిపనే అయి ఉంటుందని గ్రామస్థులు చెబుతున్నారు.

హిందువుల మనోభావాలు దెబ్బతీయడం తగదు

ఉత్తరాంధ్ర సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద స్వామి అక్కడికి చేరుకుని హిందూ సంఘాలతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉగాది పర్వదినం నాడు హిందువుల మనోభావాలు దెబ్బతినేలా ఇలాంటి చర్యలకు పాల్పడడం దారుణమన్నారు. ప్రభుత్వాలు, చట్టాలపై మాకు నమ్మకం ఉందని, బాధ్యులను గుర్తించి పోలీసులు కఠినంగా శిక్షిస్తారని నమ్ముతున్నామన్నారు. అయితే చర్యలు తీసుకో వడంలో జాప్యం చేస్తే రాష్ట్రస్థాయిలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. దోషులను శిక్షించే వరకు ఆలయం వద్ద మౌనదీక్ష చేస్తున్నట్లు ప్రకటించారు. సర్పంచ్ రవికుమార్, చల్లవానిపేట సొసైటీ మాజీ అధ్యక్షుడు కనకయ్య, వీహెచ్‌పీ, భజరంగదళ్, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బీటీ రోడ్ల నిర్మాణం ప్రభుత్వ ధ్యేయం: బగ్గు


బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

పోలాకి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో బీటీ రహదారుల నిర్మాణమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బగ్గురమణ మూర్తి అన్నారు. ఆదివారం కుసుమపోలవలస పంచాయతీ చీడివలస గ్రామాన్ని కలుపుతూ నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కుసుమపోలవలస నుంచి సుమారు 10 గ్రామాలను కలుపుతూ మూడు కిలోమీటర్ల పొడవున బీటీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామన్నారు. పనులను నాణ్యతతో చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డోల జగన్, బైరి బాస్కరరావు, డోల ప్రసాదరావు, ఎంవీనాయుడు సర్పంచ్ తర్ర లక్ష్మీనారాయణ, ఎంపీడీవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

నరసన్నపేట, మార్చి 30(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి అన్నారు. వైఎంసీఏ ఆధ్వర్యంలో వైపీఎల్ -8 క్రికెట్ పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడు పేరు మీద పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు మెండ దాసునాయుడు, నియోజవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, టీడీపీ నాయకులు, పోటీల నిర్వాహకులు పాల్గొన్నారు.

కూలిన చెట్టు


రోడ్డుపై పడిన చెట్టు

వజ్రపుకొత్తూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): బాతు పురం గ్రామానికి సమీపంలో ఆర్అండ్‌బీ రోడ్డుపై ఆదివారం సాయంత్రం మర్రిచెట్టు ఒక్కసారిగా కూలిపోయింది. ఆ సమయంలో వాహనాలు రాకపోకలు లేకపో వడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతు న్నారు. సుమారు రెండు గంటల తరువాత స్థానికులు స్పందించి చెట్టు కొమ్మలను తొలగించడం రాకపోకలు సాగాయి.

తెలుగుదనం ఉట్టిపడేలా..

(ఐదో పేజీ తరువాయి)


నరసన్నపేట బీసీ బాలికల వసతిగృహంలో ఉగాది వేడుకలు

రావలి నాగేశ్వరరావు, బోగెల ఉమామహేశ్వరరావు, పూడి జనార్దనరావులు కవి సమ్మేళనంలో పాల్గొని తమ కవితలు వినిపించారు. అనంతరం వీరిని సన్మానించారు. అందరూ ఉగాది పచ్చడిని ఆరగించారు.

ప్రజల భాగస్వామ్యంతో జిల్లా అభివృద్ధి: కలెక్టర్

జిల్లాలోని ప్రజలంతా ఆయురారోగ్యాలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, అందరి భాగస్వామ్యంతో అభివృద్ధిలో జిల్లా ముందడుగు వేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆకాంక్షించారు. ఉగాది వేడుకల్లో ఆయన మాట్లాడుతూ.. పీ4 సర్వే కార్యక్రమాన్ని ఉగాది పర్వదినాన అమరావతిలో ప్రారంభించినట్లు చెప్పారు.

జిల్లాలో చేపట్టనున్న పీ4 సర్వేతో బడుగు బలహీన వర్గాలకు మంచి జరుగుతుందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో పూర్తి బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సుపరిపాలన, సంక్షేమ ఫలాలు, ప్రజల జీవితానికి సంతోషాల తోరణాలు అని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ.. ఈ రోజు మీరు ఎంత సంతోషంగా ఉన్నారో జీవితాంతం అంతే సంతోషం లభించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, కేఆర్‌పీ ఉప కలెక్టర్ లక్ష్మణరావు, సాంఘీక సంక్షేమ శాఖ ఉపసంచాలకుడు విశ్వ మోహన్ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ కిరణ్, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, డీపీవో భారతీ సౌజన్య, డీఈవో తిరుమల చైతన్య, జిల్లా ఉద్యాన అధికారి ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి త్రినాథస్వామి, డీఎస్‌వో సూర్య ప్రకాష్, జడ్పీ సీఈవో కుమార్‌రాజ్, గాయత్రి విద్యాసంస్థల ప్రిన్సిపాల్ పులఖండం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు వినాయక విగ్రహ ప్రతిష్ఠ

నందిగాం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పెంటూరులో నూతనంగా నిర్మించిన వినాయక మందిర ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ సోమవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గ్రామస్థుడు కూర్మాపు అప్పారావు, రెయ్యమ్మ దంపతులు నిర్మించిన మందిరంలో పురోహితులు రేజేటి బోసుబాబు పర్యవేక్షణలో విశేష పూజలు చేసి విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నట్లు తెలిపారు.

జగన్నాథస్వామి ఆలయ అభివృద్ధికి చర్యలు

పోలాకి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): దీర్ఘాశిలో పురాతనమైన జగన్నాథ స్వామి ఆలయ అభివృద్ధికి ఆదివారం భూమి పూజ చేశారు. ఆలయాన్ని కంచరి కులస్థులంతా పునర్నిర్మా ణానికి నిర్ణయించారు. ఇందులో భాగంగా నేలబావి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పూరీ జగన్నాథస్వామి ఆలయం మాదిరిగా ఈ ఆలయాన్ని పునర్నిర్మిస్తామని కంచరి కుల సంక్షేమ సంఘం నాయకుడు జగన్నాథం తెలిపారు. దాతల సహకారంతో నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

పలాస, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాది సందర్భంగా స్థానిక శిష్టకరణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు నిత్యావసర సరుకులు, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు విజయ్‌కుమార్ పట్నాయక్, డబ్బీరు నాగభూషణరావు, ఎస్.ప్రసాదరావు, మహంతి, శ్రీనివాస్ పట్నాయక్, భాస్కరరావు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

కొత్తూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): కొత్తూరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షుడిగా ఎం.అప్పారావు, కార్యదర్శిగా వలురౌతు సుధాకరరావు, ఉపాధ్యక్షుడిగా సీహెచ్ రవికిరణ్, సహాయ కార్యదర్శిగా రెడ్డి ఉమామహేశ్వరావు, కోశాధికారిగా సీహెచ్ ప్రసాద్ ఎన్నికయ్యారు. అలాగే మరో ఐదుగురుసభ్యులను ఎన్నుకున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు.

రచ్చబండ ప్రారంభం

నరసన్నపేట, మార్చి 30(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో వాకింగ్ మిత్రులు, సిటిజన్ వెల్ఫేర్ సొసైటీ సాయంతో రచ్చబండను నిర్మించారు. దీనిని ఏడీఈ బీవీ సురేష్ ఆదివారం ప్రారంభించారు. వాకింగ్ మిత్రులు, విద్యుత్ కార్యాలయానికి వచ్చే వారు సేద తీర్చుకునేందుకు పెద్ద చెట్టు కింద దీనిని ఏర్పాటు చేయడం అభినంద నీయమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వుచ్చల విశ్వేశ్వరరావు, మురళి, మార్పు విజయ్, ఏఈ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎండల తీవ్రతతో ఇక్కట్లు

టెక్కలి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పగటి ఉష్ణోగ్రతలు మరింతగా పెరిగాయి. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఆదివారం ఉక్కపోతకు గురై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.